చట్టాలపై అవగాహన పెంచుకోవాలి 7

» బాలల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు అపర్ణ గిరిధర్‌రావు

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

పత్తి గింజల లారీ బోల్తా



శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

కల్యాణం కమనీయం

- భక్తిశ్రద్ధలతో శివపార్వతుల కల్యాణోత్సవం
- కనుల పండువగా ప్రభోత్సవాలు
- ఉమామహేశ్వరంలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు
- భారీగా తరలివచ్చిన భక్తులు



భక్తులకు తాళి చూయిస్తున్న అర్చకుడు వీరయ్యశాస్త్రి



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు



స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే

అచ్చంపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకర్గంలోని భోగమహేశ్వరంలో గురువారం తెల్లవారుజామున శివపార్వతుల కల్యాణం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి ఉమామహేశ్వర ఆలయానికి అచ్చంపేట నియోజకవర్గం నుంచి విద్యుద్దీపాలతో అలకరించిన ప్రభోత్సవాలు మంగళవాద్యాలతో గురువారం తెల్లవారుజామున ఉమామహేశ్వర కొండ దిగువన ఉన్న భోగమహేశ్వరానికి చేరుకున్నాయి. భోగమహేశ్వరంలోని కల్యాణమండపంలో శివపార్వతుల కల్యాణం అర్చకస్వాములు తెల్లవారుజామున నాలుగు గంటలకు అంగరంగ వైభవంగా జరిపించారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆయన సతీమణి అనురాధ కల్యాణంలో పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వివిధ గ్రామాల నుంచి తీసుకువచ్చిన తలంబ్రాలను కల్యాణం వద్ద సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవ రెడ్డి, పాలక మండలి సభ్యులు, భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లను చేశారు. ఈ ఏడాది నూతనంగా నిర్మించిన కల్యాణ మండపం రాజగోపురం పునరుద్ధరణతో భోగమహేశ్వరం విద్యుత్ దీపకాంతులతో మెరిసిపోయింది. అనంతరం పల్లకీలో ఉమామహే శ్వరం కొండపైకి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్ళారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రభుత్వ పథకాలు

పేదలకు చేరాలి





మహబూబ్‌నగర్ ఐడీవోసీ సమావేశ మందిరంలో జరిగిన సమీక్షా సమావేశానికి హాజరైన ఉమ్మడి జిల్లాలోని, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు

- లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలి
- ప్రభుత్వ పథకాల అమలులో ప్రచారలోపం ఉండొద్దు
- ఒక్కో జిల్లాలో రెండు గ్రామ సభల్లో పాల్గొంటాం..
- ఆర్అండ్ఆర్ కింద పథకాల వర్తింపుపై తగు చర్యలు తీసుకోవాలి
- గ్రామ సభల నిర్వహణ ద్వారా పలు సమస్యలు తెలుస్తాయి
- వైద్య, ఆరోగ్యశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ
- ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు అధికారులతో సమీక్ష

మహబూబ్‌నగర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ప్రభుత్వ పథకాల లబ్ధి ప్రతీ నిరుపేదకు చేరాలని, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో అధికా రులు పారదర్శకత పాటించాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామో దర రాజనర్సింహ సూచించారు. మహబూబ్ నగర్ జిల్లాలోని ఐడీఓసీ సమావేశ మందిరంలో గురువారం ఉమ్మడి జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కా ర్పొరేషన్ల చైర్మన్లు, ఇతర ప్రజాప్రతి నిధులు, అధికా రులతో కలిసి ఆయన జనవరి 26 నుంచి ప్రారంభించనున్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాలపై మరో మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాలకు సం బంధించి పథకాల అమలు తీరు, ప్రణాళికలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్లు వారి పరిధిలోని లబ్ధిదారుల సంఖ్య, పథకాల అమలు ఏర్పాట్ల ను మంత్రులకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నాలుగు పథకాలను జనవరి 26 నుంచి ప్రారంభించనుందని తెలిపారు. పథకాల అమలులో భాగంగా నిర్వహించే గ్రామసభల్లో ఎమ్మెల్యేలు, ఇందిరమ్మ కమిటీలను భాగస్వాములుగా చేసు కోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాల అమలులో సమన్వయలోపం, ప్రచారలోపం ఉండకూడదని చెప్పారు. ఈ పథకాలు ప్రజలకు చాలా మేలు చేస్తాయని, తాను సహచర మంత్రి జూపల్లి కృష్ణారావు కలిసి ఐదు జిల్లాల్లో జిల్లాకు రెండు నుంచి మూడు గ్రామసభల్లో నేరుగా పాల్గొంటామని తెలిపారు. ఐదు రోజుల కార్యక్రమ సమాచారం నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలకు అందించాలని సూచించారు.

నిర్వాసితులకు సంబంధించి పథకాల వర్తింపుపై క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు నిర్ణయం తీసుకోవాల న్నారు. క్షేత్రస్థాయిలో నాలుగైదు గ్రామసభల్లో ఎమ్మెల్యేలు పాల్గొంటే అవగాహన వస్తుందన్నారు. ఈ సభల ద్వారా



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, చిత్రంలో జూపల్లి

- మిగతా 6లో..

లబ్ధిదారులను పారదర్శకంగా గుర్తించాలి

బిజినేపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : రైతు భరోసా పథకానికి లబ్ధిదారుల ఎంపిక క్షేత్రస్థాయిలో పర్యటించి పారదర్శంగా నమోదు చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి ఎంపీడీవో కార్యాలయంలో గురువారం క్షేత్ర పరిశీలన అధికారుతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసే రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డుల పంపిణీ వంటి పథకాలకు అర్హుల జాబితా ఎంపికలో పారదర్శకంగా వ్యవహరించాలని ఆదేశించారు. 26న గణతంత్ర్య దినోత్సవం రోజు అర్హుల వివరాలను ప్రభుత్వం ప్రకటించనున్నట్లు ఆయన తెలిపారు. పాలెంలో కలెక్టర్ ఆకస్మిక పర్యటన చేసి అధికారుల పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాజ్యలక్ష్మి, తహసీల్దారు శ్రీరాములు, డీటీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్



సింగోటం గ్రామంలో కొనసాగుతున్న లక్ష్మీ నరసింహస్వామి ప్రభోత్సవం

భక్తిశ్రద్ధలతో ప్రభోత్సవం

- ఉత్సవమూర్తుల ఊరేగింపు
- నేడు రథోత్సవం
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి జూపల్లి కృష్ణారావు 7

జీసీడీవో అక్రమ డిప్యుటేషన్ రద్దు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- అక్రమ డిప్యుటేషన్‌లున్న టీచర్లను సొంత స్థానాలకు పంపాలి
- మహబూబ్‌నగర్ డీఈవో ప్రవీణ్‌కుమార్ ఆదేశం
- 'అక్రమాలకు అందలం' కథనంతో విద్యాశాఖలో కలకలం 6



మంచాలకట్ట వద్ద కృష్ణానదిలో మరబోటులో ప్రయాణం చేస్తున్న స్థానికులు


పెను విషాదానికి.. 18 ఏళ్లు

- 2007 జనవరి 18న కృష్ణానదిలో మునిగిపోయిన మరబోటు 7
- రాయలసీమకు చెందిన 61 మంది జలసమాధి
- సింగోటం బ్రహ్మోత్సవాలకు వస్తుండగా దుర్ఘటన

దస్ దిన్‌కా సుల్తాన్..



- పురపాలనకు 26న ముగియనున్న గడువు
- జడ్చర్ల, అచ్చంపేట మునిసిపాలిటీలకు మరో 15 నెలల సమయం
- ఇప్పట్లో ఎన్నికలు లేనందున 27 నుంచి ప్రత్యేకాధికారుల పాలన
- గడువు సమీపిస్తుండటంతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయాలని ప్లాన్
- ఎన్నికల నాటికి పాలమూరు కార్పొరేషన్, దేవరకద్ర, మద్దూర్ మునిసిపాలిటీలు అయ్యేనా?



గద్వాల మునిసిపల్ కార్యాలయం

మహబూబ్‌నగర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పురపాలన గడువు ముగుస్తోం ది... మరో పది రోజుల్లో ప్రస్తుత పాలకమండలి సమయం ముగియనుంది.. ఇప్పటికే సర్పంచ్ లు, ఎంపీటీసీ, జడ్పీటీసీల గడువు ముగియగా ఈనెల 26తో పురపాలన ముగియనుం డటం.. ఇప్పుడిప్పుడే ఎన్నికలు నిర్వహించే అవకాశం లేకపోవడంతో 27నుంచి మునిసి పాలిటీలలో ప్రత్యేక పాలన అమలులోకి రానుంది.. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 19 మునిసిపాలిటీలు ఉండగా అందులో జడ్చర్ల, అచ్చంపేట మునిసిపాలిటీలు మినహా మిగతా అన్నిచోట్ల ప్రత్యేకాధికారుల పాలన రాబోతుంది. జడ్చర్ల, అచ్చంపేటలకు మాత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ వరకు గడువు ఉంది. వీటికి 2021 ఏప్రిల్ 30న ఎన్నికలు జరగడంతో పాలకమండలికి ఇంకా 15 నెలల సమయం ఉంది. కాగా గ్రామపంచాయతీలలో ఏడాది కాలంగా ప్రత్యేకపాలన కొనసాగు తుండగా ఎంపీ టీసీ, జడ్పీటీసీ సభ్యుల గడువు ముగిసి ఆరు నెలలు అవుతోంది. వీటికి ఫిబ్రవరి, మార్చిలో ఎన్నికలు

- మిగతా 6లో..

అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వానికి

రెండు కళ్లలాంటివి

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

పెద్దమందడి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వానికి రెండు కళ్లలాంటావని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. గురువారం వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలో ఆయన పర్యటించారు. జంగమాయపల్లి శివారులో కొమ్ములగట్టు లక్ష్మీ వేంకటేశ్వరస్వామికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. వెల్టూరు గ్రామంలోని వీవర్స్ కాలనీలో అండర్ డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్యం లోపించకుండా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. అలాగే సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు ఆయన బహుమతులను అందజేశారు. క్రీడల అభివృద్ధి కోసం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేసిందని, ఈ క్రమంలో స్టేడియాలను నిర్మిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తోందన్నారు. నేటియువత ఉద్యోగాలతో పాటు స్వయం ఉపాధిపై కూడా దృష్టి సారించాలని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు కమిటీ ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటస్వామి, మాజీ సర్పంచు శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.



వెల్టూరులో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

మహోన్నత వ్యక్తి జైపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



జైపాల్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): దేశ రాజకీయాలను ప్రభావితం చేసిన మహోన్నత వ్యక్తి కేంద్ర మాజీమంత్రి దివంగత సూదిని జైపాల్‌రెడ్డి అని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని కొట్ర చౌరస్తాలో జైపాల్‌రెడ్డి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కశిరెడ్డి నారాయణరెడ్డి స్థానిక నాయకులతో కలిసి జైపాల్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పించారు. పార్లమెంటులో తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టడంలో జైపాల్‌రెడ్డి పాత్ర వెలకట్టలేనిదన్నారు. ప్రపంచ దేశాలలో తన వాగ్ధాటితో దేశ గొప్పదనాన్ని తెలియజేసి, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ఖ్యాతిగాంచిన వ్యక్తి అని ప్రశంసించారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన జైపాల్‌రెడ్డి చిరస్మరణీయుడని నారాయణరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో పీసీబీ సభ్యుడు బాలాజీసింగ్, నాయకులు భూపతిరెడ్డి, ఆనంద్‌కుమార్, పీసీఎస్ డైరెక్టర్లు వెంకటయ్యగౌడ్, సంజీవ్‌కుమార్, విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మోతీలాల్ తదితరులు ఉన్నారు.

ఢీ అంటే ఢీ

- ఉత్సాహంగా బండ లాగుడు పోటీలు 7
- హోరాహోరీగా పొట్టేళ్ల పందేలు

జూరాల కాలువలోకి

రసాయనిక వ్యర్థాలు

- నురగలు తేలిన నీరు
- ఆందోళనలో రైతులు 7

నేరాల నియంత్రణలో

సీసీ కెమెరాలు కీలకం



వ్యాపారులతో మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి అర్బన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): నేరాలు నియంత్రించడం, నిందితులను గుర్తించడంలో సీసీ కెమెరాలు కీలకమని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. గురువారం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని శంకర్ గంజిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రోజు రోజుకు పెరుగుతున్న నేరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతీ ఒక్కరు తమ భద్రత కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పోలీస్ శాఖ ప్రతినిత్యం ప్రజల క్షేమం కోసం పని చేస్తోందని, ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ కృష్ణ, ఎస్ఐ హరిప్రసాద్, కౌన్సిలర్ బ్రహ్మం చారి, బులియన్ మర్చంట్ అధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో...
ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు ఈ క్రింది నెంబర్లకు సంప్రదించగలరు.
మహబూబ్‌నగర్ : 9985411175, 9985403259
నాగర్‌కర్నూల్ : 9985410905
వనపర్తి : 9985403242
గద్వాల : 9985403238
నారాయణపేట : 9985411463
మరిన్ని వివరాలకు సంప్రదించండి
9985411365

జీసీడీవో అక్రమ డిప్యుటేషన్ రద్దు

● అక్రమ డిప్యుటేషన్‌లున్న టీచర్లను సొంత స్థానాలకు పంపాలి

● మహబూబ్‌నగర్ డీఈవో ప్రవీణ్‌కుమార్ ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీల పర్యవేక్షకురాలిగా అక్రమ డిప్యూటేషన్ పొందిన అధికారిని డిప్యుటేషన్ రద్దు చేస్తున్నట్లు డీఈవో ప్రవీణ్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. తాత్కాలిక ఇన్‌చార్జి జీసీడీవోగా ఉపాధ్యాయురాలు రాధను విధుల్లో తీసుకున్నారని, అయితే ఆమెపై పలు ఆరోపణలు వచ్చాయని, ఆంధ్రజ్యోతి దిన పత్రికలో కథనం రావడం, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల నుంచి పలు ఫిర్యాదులు రావడంతో డిప్యుటేషన్‌ను రద్దు చేసినట్లు తెలిపారు. కేజీబీవీల పర్యవేక్షణ కోసం కొత్తవారికి రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ నియమించేవరకు ఎవరైనా మహిళా ఉపాధ్యాయురాలును నియమించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎలాంటి ఆరోపణలు లేకుండా ఉన్న వారు ముందుకు రావాలన్నారు. జిల్లాలో గతంలో ఇచ్చిన ఉపాధ్యాయుల డిప్యుటేషన్‌లు సరిగా లేవని, గతంలో ఏమి జరిగింది తెయదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా డిప్యుటేషన్‌పై పని చేస్తున్న ఉపాధ్యాయులకు వారి సొంత పాఠశాలకు పంపించాలని సంబంధిత మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించనున్నట్లు తెలిపారు. ఇతర మండలం నుంచి మరో మండలంలో పని చేస్తున్న టీచర్లను వెంటనే వారి పాతపాఠశాలలలో వారంతట వారే పని చేసేందుకు పోవాలని సూచించారు.

ఈ డిప్యుటేషన్ ప్రక్రియ పాఠశాల ప్రారంభం నాటికి పూర్తి చేస్తామన్నారు. గతంలో ఏం జరిగిందో తనకు తెలియదుకాని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిప్యుటేషన్‌లు ఉంటాయన్నారు.

విద్యాశాఖలో కలకలం రేగిన ఆంధ్రజ్యోతి కథనం

'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన 'అక్రమాలకు అందలం' కథనంతో విద్యాశాఖలో కలకలం రేగింది. డిప్యుటేషన్‌పై వచ్చిన జీసీడీవో అదే పోస్టులో ఉండేందుకు పలువురు విద్యార్థి సంఘాల నాయకులను కలిసింది. తనపై ఎవరూ అధికారులకు ఫిర్యాదు చేయవద్దని ఓ ప్రైవేట్ పాఠశాల నాయకుడి దగ్గరకు వారిని తీసుకెళ్లి మంతనాలు జరిపినట్లు తెలిసింది. అందుకు విద్యార్థి సంఘాల నాయకులు అంగీకరించలేదని పలువురు చర్చించుకుంటున్నారు.

ప్రభుత్వ పథకాలు నిరుపేదలకు చేరాలి

(మొదటిపేజీ తరువాయి)

పథకాలపై మాత్రమే కాకుండా క్షేత్రస్థాయి సమస్యలు కూడా అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలుస్తాయన్నారు. గ్రామాల వారీగా అన్ని పథకాలకు ఎంతమంది లబ్ధిదారులు ఉన్నారు, ఎంతమందికి లబ్ధి చేకూరింది, ఎన్ని నిధులు మంజూరు అయ్యాయి అనే గణాంకాలు తీసుకొని ఎమ్మెల్యేలకు ఇస్తే వారు కూడా ఆయా గ్రామాలకు ఏం చేశారో ప్రజలకు చెప్పుకునే వెసులుబాటు కలుగుతుందని అన్నారు.

అందరినీ భాగస్వామ్యం చేయాలి

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా గొప్ప పథకమని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆ పథకం అందని వారు నిరాశ చెందకుండా వారిని ఉపాధి హామీ పనులకు వెళ్లి మరోసారి దరఖాస్తు చేసుకునే విధంగా అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ పథకం అమలుపై ఫీల్డ్ అసిస్టెంట్లు వ్యతిరేక ప్రచారం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. సొంత స్థలం లేని వారికి మలి దఫాలో ఇళ్లు వస్తాయని, జాగలేని నిరుపేదలకు సర్ది చెప్పాలని సూచించారు. కొత్త పథకాల అమలులో అర్హుల ఎంపిక ప్రక్రియ సమర్థవంతంగా జరగాలని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కోరారు. ప్రజాపాలన దరఖాస్తుల సమయంలో అనుకోని కారణాల వల్ల దరఖాస్తులు చేసుకోని వారికి కూడా ప్రభుత్వం పథకాల వర్తింపులో అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సూచించారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సర్వే జరిగిన చోటనే స్క్రూటినీ చేయాలని సూచించారు. ఇళ్లు ఉన్న వారిని అర్హుల జాబితా నుంచి తొలగించాలని అన్నారు. పక్కనే ఉన్న కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నదని, ఆ ప్రభుత్వంతో మాట్లాడి జూరాలకు ఐదు టీఎంసీల నీటిని విడుదల చేయించాలని కోరారు. ఆర్అండ్ఆర్ కాలనీల వారికి కూడా ఇందిరమ్మ ఇళ్ల పథకం వర్తింప జేయాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సూచించారు. జర్నలిస్టులు కూడా ఇందిరమ్మ ఇళ్లు అడుగుతున్నారని, ఒకసారి పరిశీలించి అర్హులైన వారికి ఇవ్వాలని, రేషన్ కార్డులు కూడా అర్హులందరికీ మంజూరు చేయాలని నాగర్‌కర్నూలు ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి కోరారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో టెక్నికల్, ప్రాక్టికల్ సమస్యలు తలెత్తుతున్నాయని, క్షేత్రస్థాయిలో ఫిల్టర్ చేసిన జాబితాను గ్రామసభలో పెట్టాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కోరారు.

ఎస్సీ నియోజకవర్గంలో ఎక్కువ ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు మంత్రులను కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్ రవి, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, కలెక్టర్లు విజయేందిర బోయి, బదావత్ సంతోష్, ఆదర్శ్ సురభి, బీఎం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశానికి వస్తున్న మంత్రులు, అధికారులు

పకడ్బందీగా లబ్ధిదారులను ఎంపిక చేయాలి

నాలుగు పథకాలను లోపాలు లేకుండా పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. గ్రామసభ నిర్వహణ, క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిబంధనల ప్రకారం నడుచుకొని అర్హులందరినీ ఎంపిక చేయాలన్నారు. ఆన్‌లైన్ టిక్ చేయకపోవడం వల్ల అర్హులు కాకుండా పోతున్నారని అన్నారు. వ్యవసాయ యోగ్యం కాని భూములను పంచాయతీ కార్యదర్శులు నిశితంగా సర్వే చేసి గుర్తించాలన్నారు.

గూగుల్ మ్యాపింగ్ ద్వారా సర్వే చేస్తున్నారా, లేదా అని అధికారులను ఈ సందర్భంగా ప్రశ్నించారు. వనపర్తి జిల్లా చిన్నంబావి మండలంలోని ఓ గ్రామంలో రేషన్ కార్డుల దరఖాస్తుల్లో వ్యత్యాసం వచ్చిందని, అలా కాకుండా చూడాలన్నారు. గ్రామసభలు నిర్వహించే ముందే ఊర్లో టామ్ టామ్ వేయించాలని అధికారులను ఆదేశించారు.

- మంత్రి జూపల్లి కృష్ణారావు

ఇసుక అక్రమ నిల్వలు సీజ్

- పోల్కంపల్లి గుంపోల్ గుట్టలో ఇసుక అక్రమ నిల్వలపై రెవెన్యూ దాడులు

మూసాపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలంలోని పోల్కంపల్లి గ్రామ శివారులో గుంపోల్ గుట్ట పరిసరాల్లో గుర్తు తెలియని వ్యక్తులు ఇసుకను అక్రమంగా నిల్వ చేశారు. ఈ విషయంపై సమాచారం తెలుసుకున్న గిర్దావర్ అరుణ్‌కుమార్, రెవెన్యూ అసిస్టెంట్ మహేష్‌కుమార్ పోలీసుల సమక్షంలో విచారించి పంచనామా నిర్వహించి సీజ్ చేశారు. సుమారు మూడు భారత్ బెంజ్‌ల ఇసుక అక్రమంగా నిల్వలు చేశారని తెలిపారు. ఇట్టి ఇసుకను అక్కడి నుంచి మూసాపేట తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో భద్రత కోసం నిల్వలు చేసినట్లు తహసీల్దార్ రాజు తెలిపారు. అక్రమంగా ఎక్కడైన ఇసుకను నిల్వలు చేస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. తాళ్లగడ్డ వాగు నుంచి ఇసుకను మిని డీసీఎంలతో నిల్వలు చేసి భారత్‌బెంజ్ వాహనాలతో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు స్థానికులు తెలిపారు.



పోల్కంపల్లి గుంపోల్ గుట్టలో ఇసుక నిల్వలను సీజ్ చేస్తున్న అధికారులు, పోలీసులు

దస్ దిన్ కా సుల్తాన్

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించే అవకాశం ఉండటంతో ఆ ఎన్నికలు అయ్యాక మునిసిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. ఇదే జరిగితే పుర ఎన్నికలకు మరో 4-6 నెలల సమయం పట్టే అవకాశం ఉంది.

● పాలమూరు పుర ఎన్నికలు కార్పొరేషన్‌లోనేనా ?

పాలమూరు పురపాలికను కార్పొరేషన్ చేస్తున్నట్లు అసెంబ్లీలో ప్రకటన చేశారు. కానీ ఇప్పటి వరకు ఇందుకు సంబంధించిన జీవో గెజిట్ విడుదల కాలేదు. గెజిట్ విడుదలైతే మునిసిపాలిటీలలో విలీనం చేసే కొత్త గ్రామాలను కలిపి వార్డుల పునర్విభజన చేయాలి. పునర్విభజన అనంతరం అభ్యంతరాలు స్వీకరించి వాటిని ఫైనల్ చేయాల్సి ఉంటుంది. ఇందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉంది. అయితే ఎన్నికలు జరిగేందుకు మరికొంత సమయం ఉన్నందున ఆలోగా గెజిట్ విడుదల చేసి ఎన్నికల నాటికి కార్పొరేషన్ ప్రక్రియను పూర్తిచేస్తే కార్పొరేషన్ హోదాలోనే ఎన్నికలు జరగనున్నాయి. ఇక ఉమ్మడి పాలమూరులోని దేవరకద్ర, మద్దూర్ మేజర్ గ్రామపంచాయతీలను కూడా మునిసిపాలిటీలు అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు అసెంబ్లీ ప్రకటన చేశారు. వీటికి కూడా గెజిట్ విడుదల చేయాల్సి ఉంది. ఈ మునిసిపాలిటీలలో పలు గ్రామాలను విలీనం చేసేందుకు ప్రతిపాదనలు చేశారు. కాగా సర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్ కన్నా ముందుగానే మునిసిపాలిటీల ఏర్పాటు ప్రక్రియ పూర్తైతే వాటిలో కలిసే గ్రామాలను సర్పంచ్ ఎన్నికల నుంచి మినహాయించనున్నారు.

● పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు

పురపాలన పదిరోజుల్లో ముగియనుండటంతో అన్ని పురపాలికలలో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయాలని మునిసిపల్ చైర్మన్‌లు, కౌన్సిలర్‌లు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న జనరల్ ఫండ్‌తో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీ నిధులతో పాటు కొందరు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించుకుని ఆయా పనులను ఈ పదిరోజుల్లో ప్రారంభించాలని ప్లాన్ చేస్తున్నారు. ఆయా వార్డులలో మరికొన్ని పనులను ప్రతిపాదించి ఈనెల 26లోగా చివరి కౌన్సిల్ సమావేశాలు నిర్వహించి ఆ సమావేశాల్లో పనులకు ఆమోదం తెలుపుతూ కౌన్సిల్ తీర్మానాలు చేయాలని నిర్ణయించారు. వార్డులలో అత్యవసర పనులు రేపు ఎన్నికలలో తమకు ఓటుబ్యాంకుగా ఉపయోగపడే పనులను చేయించాలని చైర్మన్‌లు, కౌన్సిలర్‌లు భావిస్తున్నారు. పాలమూరు పురపాలికలో వారం, పదిరోజుల నుంచే పెద్దఎత్తున అభివృద్ధి పనులను ప్రారంభించే కార్యక్రమాలు చేస్తున్నారు. చివరి పది రోజుల్లో కూడా కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దీంతో అన్ని మునిసిపాలిటీలలో చైర్మన్‌లు, కౌన్సిలర్‌లు పనుల ఎంపికలో బిజీబిజీగా ఉన్నారు.

● రిజర్వేషన్‌లపై టెన్షన్

ప్రస్తుతం ఉన్న చైర్మన్, చైర్‌పర్సన్, కౌన్సిలర్‌లలో చాలామంది మళ్లీ పోటీ చేసేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. మరోసారి బరిలో నిలువాలని ఓవైపు ప్రయత్నాలు చేస్తుండగా మరోవైపు రిజర్వేషన్‌ల భయం వారిని వెంటాడుతోంది.. మళ్లీ రిజర్వేషన్‌లు అమలు చేయనుండటంతో చైర్మన్, కౌన్సిలర్‌ల రాజకీయ భవితవ్యం వాటిపైనే ఆధారపడి ఉండటంతో తమకు అనుకూలంగా రిజర్వేషన్‌లు రావాలని కోరుకుంటున్నారు. అధికార పార్టీ అయిన కాంగ్రెస్‌లో పోటీ ఎక్కువగా ఉండటంతో రిజర్వేషన్‌లు ఖరారైతే అందులో సగం మంది పోటీనుంచి తప్పుకునే అవకాశం ఉంటుంది. కొందరు నాయకులు తమకు అనుకూలమైన రిజర్వేషన్‌లు వచ్చేలా నాయకులతో పైరవీలు చేయించుకునే యోచనలో ఉన్నారు. అధికార పార్టీ ముఖ్య నేతలు కూడా తమకు అనుకూలమైన వారికోసం రిజర్వేషన్‌లు మార్చుకునే అవకాశం లేకపోలేదు. అయితే రిజర్వేషన్‌ల వ్యవహారం ఎన్నికలకు ముందు జరిగే తంతు కావడంతో అప్పటివరకు ఎవరి పనుల్లో వాళ్లు వార్డులలో కార్యక్రమాలు చేసుకుంటూ పోవాలని ప్రస్తుతం ఆశావహులు ప్రజలకు దగ్గరయ్యే ప్రయత్నాలు సాగిస్తున్నారు.

● మునిసిపాలిటీ ఎన్నికల ఫలితాలు పార్టీల మనుగడపై ప్రభావం చూయించేవి కావడంతో అధికార పార్టీతో పాటు విపక్షాలు ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోనున్నాయి. చైర్మన్‌ల ఎన్నికకు ఎక్స్‌అఫీషియో ఓట్లుగా ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల ఓట్లు ఉండటంతో అధికార పార్టీకి కలిసివచ్చే అవకాశం ఉంటుంది. గత ఎన్నికలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కొన్నిచోట్ల హంగ్ వచ్చినా ఎక్స్‌అఫీషియో ఓట్లతో పలు మునిసిపాలిటీలను తమ ఖాతాలో వేసుకుంది. 2019లో ఉమ్మడి జిల్లాలో మక్తల్ మునిసిపాలిటీని బీజేపీ దక్కించుకోగా మిగతా అన్ని మునిసిపాలిటీలను కాంగ్రెస్ గెలుచుకుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత పలు మునిసిపాలిటీలలో మెజారిటీ కౌన్సిలర్‌లను కాంగ్రెస్‌లో చేర్చుకుని అవిశ్వాస తీర్మానాలతో ఆరు మునిసిపాలిటీలను కైవసం చేసుకుంది. ప్రస్తుత ఎన్నికల్లో అన్ని మునిసిపాలిటీలను గెలుచుకోవాలని అధికార పార్టీ పట్టుదలతో ఉంది.



నారాయణపేట మునిసిపల్ కార్యాలయం

రేపు నవోదయ ప్రవేశ పరీక్ష

-ఎంట్రెన్స్ టెస్ట్ సజావుగా నిర్వహించాలి : ప్రిన్సిపాల్ పీ భాస్కర్ కుమార్

బిజినేపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించే జవహర్ నవోదయ ఆరో తరగతి ప్రవేశ పరీక్షను సజావుగా నిర్వహించాలని నవోదయ ప్రిన్సిపాల్ పీ భాస్కర్‌కుమార్ ఆదేశించారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 27 పరీక్ష కేంద్రాలకు చెందిన 27 మంది సీఎస్‌లు, 27 మంది పరిశీలకులకు అవగాహన కల్పించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 6,602 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, ప్రతీ 24 మంది విద్యార్థులకు ఒక గది, ఒక ఇన్విజిలేటర్‌ను కేటాయించినట్లు తెలిపారు. పరీక్ష నిర్వహణలో అవంతరాలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా నిర్వహించేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో పరీక్షల శిక్షణాధి కారి భాస్కరాచారి, ఎంఈవో భాస్కర్‌రెడ్డి, రఘునాథ్ శర్మ తదితరులు ఉన్నారు.

నేడు గంధోత్సవం

- ఉర్సుకు రంగాపూర్ నిరంజన్ షావలీ దర్గా వద్ద ఏర్పాట్లు పూర్తి



ఉత్సవాలకు ముస్తాబు చేసిన నిరంజన్ షావలీ దర్గా

అచ్చంపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లాలోనే వైభవంగా నిర్వహించే ఉర్సుకు రంగాపూర్ నిరంజన్ షావలీ దర్గా సిద్ధమైంది. నేడు అచ్చంపేట, అమ్రాబాద్, పదర తదితర గ్రామాల నుంచి గంధం తీసుకువచ్చి దర్గాలో సమర్పిస్తారు. రంగాపూర్ గ్రామ పరిధిలోని ఉమామహేశ్వరం బ్రహ్మోత్సవాలు, నిరంజన్ షావలీ ఉర్సు ఒకేసారి జరుగుతుండడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టిబందోబస్తు ఏర్పాటు చేశారు. రంగాపూర్ జాతరకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలిరానున్నారు. వారం రోజుల పాటు జరిగే ఈ ఉర్సులో భక్తులకు ఇబ్బంది కలుగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

గువ్వలది అనవరస రాద్ధాంతం

- కాంగ్రెస్ లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ ఛత్రునాయక్

అచ్చంపేట టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పద్ధతి మార్చుకోవాలని కాంగ్రెస్ లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ ఛత్రునాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని భ్రమరాంబ దేవాలయంలో ఎమ్మెల్యే దంపతులు డాక్టర్ వంశీకృష్ణ, అనురాధలు పూజ కార్యక్రమంలో ఉండగా, గువ్వల బాలరాజు వెళ్లి గొడవకు దిగడంపై ఆయన ఖండించారు. గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఛత్రు నాయక్ మాట్లాడారు. ఎమ్మెల్యే దంపతులు పూజలో ఉన్నారని చెప్పినా కావాలనే మాజీ ఎమ్మెల్యే బాలరాజు దేవాలయంలోకి దూసుకొచ్చి రాద్ధాంతం సృష్టించారని పేర్కొన్నారు. పోలీసులు శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా వ్యవహరించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కుంద మల్లికార్జున్, జైపాల్, వెంకట్ యాదవ్, రాజ్‌గోపాల్, కృష్ణ, దేవేందర్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేపై కేసు నమోదు

అచ్చంపేట టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేట పట్టణంలో బుధవారం ప్రభోత్సవం సందర్భంగా విధులకు అటకం కలిగించినందుకు మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్ తెలిపారు. పట్టణంలోని భ్రమరాంబికా ఆలయం నుంచి ప్రారంభమైన ప్రభోత్సవంలో జరిగిన సంఘటన వల్ల పోలీసుల విధులకు అటకం కలగడం పై మాజీ ఎమ్మెల్యేతో పాటు పలువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వీడియోల ఆధారంగా మరి కొంత మంది పై కేసు నమోదు చేస్తామన్నారు.

బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి

- తర్నికల్‌లో బంధువుల రాస్తారోకో

- మృతదేహాలను పరిశీలించిన ఎమ్మెల్యే కశిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుర్క

కల్వకుర్తి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం తర్నికల్ గ్రామ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం రాస్తారోకో చేశారు. కల్వకుర్తి పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. వారి ఆందోళనకు కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సంఘీభావం తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి మృతదేహాలను పరిశీలించారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం, ప్రమాదానికి కారణమైన వారు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సుమారు ఐదు గంటల పాటు రాస్తారోకో చేయడంతో వాహనాలు నిలిచిపోయాయి. ఆందోళన కారులతో కల్వకుర్తి సీఐ నాగార్జున మాట్లాడి ధర్నా విరమించాలని కోరారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తి వచ్చిన తర్వాతే మృతదేహాలకు పోస్టుమార్టం చేయిస్తామని అంత వరకు ఆసుపత్రి వద్ద నిరసన తెలుపుతామని రాస్తారోకో విరమించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

తర్నికల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బంగారయ్య, మహేష్ మృతదేహాలను, ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందిన నాగమ్మ పార్థీవదేహానికి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి నివాళులర్పించారు. మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేశారు. బంగారయ్య, మహేష్ పిల్లల చదువుకు తాము పూర్తిగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు ఠాకూర్ బాలాజీసింగ్, మాజీ సర్పంచ్‌లు బృంగి ఆనంద్‌కుమార్, ఎన్నం భూపతిరెడ్డి, నాయకులు సంజీవ్‌కుమార్‌యాదవ్ ఉన్నారు.



రాస్తారోకో చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్థులు

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

ఖిల్లాఘణపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సల్కెలాపూర్‌లో అభయాంజనేయ స్వామి, నూతన ఆలయం నిర్మాణానికి, గ్రామంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు గురువారం ఎమ్మెల్యే మేఘారెడ్డి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామంలోని యువతలో స్కిల్స్‌ను పెంపొందించడానికి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఉపయోగపడుతుందని అన్నారు. సల్కెలాపూర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని తెలిపారు. గ్రామం నుంచి గౌరారం, మంగనూరు రోడ్లను నిర్మించి రవాణా వ్యవస్థను మెరుగుపరుస్తామని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతీఒక్కరికి న్యాయం చేయడానికి కృషి చేస్తామని అన్నారు. ఇల్లులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ఇందిరమ్మ, ప్రతీ రైతుకు రైతుభరోసా పథకం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మురళీధర్‌రెడ్డి, విజయ్ కుమార్, సాయిచరణ్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, శ్యాంసుందర్ రెడ్డి, రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజం

- కలెక్టర్ బదావత్ సంతోష్

- అదనపు కలెక్టర్ కె.సీతారామారావుకు ఘనంగా వీడ్కోలు

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బదిలీ అయిన రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.సీతారామారావును ఘనంగా సన్మానించారు. కలెక్టర్ మాట్లాడుతూ అదనపు కలెక్టర్ కె.సీతారామారావు జిల్లాలోని అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమన్వయంతో పని చేస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సక్రమంగా పకడ్బందీగా నిర్వహించారన్నారు. బదిలీపై వెళ్తున్న అదనపు కలెక్టర్ కె.సీతారామా రావు మాట్లాడుతూ తాను పని చేసినంత కాలం జిల్లాలో అధి కారులు, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవసహాయం, డిప్యూటీ కలెకర్లు అరుణారెడ్డి, యాదగిరి, కలెక్టరేట్ పరిపాలనాధికారి చంద్రశేఖర్, జిల్లా అధికారులు రమేష్, రాంలాల్, రజిని, ఫిరంగి, ఖాజాఅలీ అఫ్సర్, నరేందర్‌రెడ్డి, రాంమ్మోహన్‌రావు, సీతారాంనాయక్, శ్రీనివాసులు, స్వరాజ్యలక్ష్మి, ఆర్డీవోలు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్ కె.సీతారామారావును సన్మానిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

కల్లు సీసాలో పాము కళేబరం

- ఆందోళన వ్యక్తం చేస్తున్నగ్రామస్థులు

బిజినేపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని లట్టుపల్లి గ్రామంలో కల్లు దుకాణంలోని ఓ కల్లుసీసాలో పాము కళేబరం రావడంతో ప్రజలు భయాందోళన చెందారు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు... గ్రామంలోని కల్లు దుకాణంలో రోజూలాగే కల్లు తాగేందుకు వెళ్లిన గ్రామస్థులు కల్లు సీసా తీసుకున్నారు. కల్లు తాగుతుండగా ఒకసారిగా సీసాలో నుంచి పాము కళేబరం బయటకు రావడంతో ఆందోళన చెందారు. అక్కడికి కల్లు తాగేందుకు వచ్చిన గ్రామస్థులంతా కల్లు విక్రయదారుతో వాగ్వివాదం పెట్టుకొని కల్లు పెట్టెలను కిందపడేసి ఆందోళన చేశారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సీసాలను శుభ్రంగా కడిగిస్తామని గ్రామ గౌడ సంఘం సభ్యులు హామీ ఇచ్చారు.

గడ్డివాము దగ్ధం

చారకొండ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) మండలంలోని గోకారం గ్రామానికి చెందిన రైతు దామర్ల వెంకటయ్య తన పశువులకు మేత కోసం ఇటీవల నల్గొండ జిల్లా నుంచి వరిగడ్డిని కొనుగోలు చేసి తీసుకొచ్చాడు. ఇంటి ఆవర ణలో గడ్డిని వాములా పెట్టి దానిపై టార్పాలిన్ కవర్‌ను కప్పి ఉంచాడు. గురువారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి వాముకు నిప్పు పెట్టారు. వెంకటయ్య ఇంటినుంచి మంటలు, పొగలు వస్తుండడంతో గమనించిన చుట్టు పక్కల వాళ్లు వెంటనే ఇంట్లో ఉన్న వెంకటయ్యను నిద్ర లేపడంతో అప్పటికే పూర్తిగా గడ్డివాము దగ్ధమైంది. కాలిపోయిన వరిగడ్డి విలువ రూ. 20 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు వెంకటయ్య కోరారు.

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

మదనాపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అజ్జకొల్లుకి చెందిన భారతయ్యా గుండె సంబంధిత సమస్యతో హైదరా బాద్ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందు తున్నాడు. గుండె ఆపరేషన్ కోసం గురువారం ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తన స్వగృహంలో బాధిత కుటుంబానికి రూ.నాలుగు లక్షల విలువ చేసే ఎల్‌వోసీని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్



బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

» హైదరాబాద్‌లో ఘటన

వనపర్తి రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా కేంద్ర మండలానికి చెందిన బీటెక్ విద్యార్థి భానుప్రకాష్ హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెద్దగూడెం గ్రామానికి చెందిన ఎద్దుల కృష్ణయ్య, పద్మ దంపతుల కుమారుడు భానుప్రకాష్ (17) హైదరాబాద్‌లోని బ్రిలియంట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అబ్దుల్లాపూర్ మెట్‌లోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్నాడు. సంక్రాంతి సెలవుల్లో స్వగ్రామానికి వచ్చిన ఆయన పండుగ అనంతరం బుధవారం సాయంత్రం హైదరాబాద్‌కు వెళ్లాడు. గురువారం తెల్లవారుజామున హాస్టల్ భవనం ఇనుప మెట్లకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన తోటి విద్యార్థులు కళాశాల యాజమాన్యానికి, బాధిత కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో వారు వెంటనే హైదరాబాద్‌కు బయలుదేరారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

అదృశ్యమైన వ్యక్తి మృతి

» దుందుభీ వాగులో మృతదేహం లభ్యం



ఉప్పునుంతల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : అదృశ్యమైన ఓ వ్యక్తి మృతదేహం దుందుభీ వాగులో లభ్యమైంది. నాగర్‌కర్నూల్ జిల్లా, ఉప్పునుంతల మండల పరిధిలోని మొల్గర గ్రామ సమీపంలో గురువారం ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కుంటల భిక్షపతి (35) ఈనెల తొమ్మిదిన అదృశ్యమయ్యాడు. ఈ విషయంపై అతడి తండ్రి కుంటల జంగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో దుందుభీ వాగులో గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికితీయగా, అతడు భిక్షపతిగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..

కల్వకుర్తి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి మండలం, తర్నికల్ సమీపంలో బుధవారం సాయంత్రం ఆటో, కారు ఢీకొన్నాయి. ప్రమాదంలో జోగు బంగారయ్య, మహేశ్ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడ్డ నాగమ్మ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అనుమానాస్పదంగా వ్యక్తి ..

కోస్గి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : దావత్ కోసం స్నేహితులతో కలిసి వెళ్లిన ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. నారాయణపేట జిల్లా, గుండుమాల్ మండలంలోని భక్తిమళ్ల గ్రామంలో ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ బాలరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రాములు (42)ను కృష్ణయ్య, ఆంజనేయులు, పురుషోత్తం అనే ముగ్గురు వ్యక్తులు బుధవారం మధ్యాహ్నం పార్టీ చేసుకుందామని చెప్పి ఇంటి నుంచి తీసుకెళ్లారు. సాయంత్రం ఆరు గంటల సమయంలో రాములును ఇంటికి తీసుకొచ్చి పడుకోబెట్టి వెళ్లిపోయారు. రాత్రి ఎనిమిది గంటల సమయంలో భోజనం చేసేందుకు అతడిని లేపేందుకు యత్నించారు. కానీ అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. దావత్ కోసం కుమారుడిని తీసుకెళ్లిన వారిపై అనుమానం వ్యక్తం చేస్తూ అతడి తల్లి మొగులమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పత్తి గింజల లారీ బోల్తా



బోల్తా పడిన లారీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, ఠాకూర్ బాలాజీసింగ్, మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్

కల్వకుర్తి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : పత్తి గింజల లోడుతో వస్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడింది. నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తాలో గురువారం ఈ సంఘటన జరిగింది. సమాచారం అందుకున్న సీఐ నాగార్జున ఆధ్వర్యంలో ఎస్‌ఐ, సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకున్నారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు ఠాకూర్ బాలాజీసింగ్, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓవర్ లోడ్‌తో వచ్చే వాహనాలపై కఠినంగా వ్యవహరించాలని పోలీసులను ఆదేశించారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

పాన్‌గల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలంలోని మల్లాయిపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్‌రెడ్డి (39) గురువారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెంకటేశ్వర్‌రెడ్డి కొంత కాలంగా హైదరాబాద్‌లో నివసిస్తూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ, జీవనం కొనసాగిస్తున్నాడు. సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామానికి వచ్చారు. కుటుంబ సభ్యులతో కలిసి పండుగను సంతోషంగా జరుపుకున్నారు. బుధవారం రాత్రి సమయంలో భోజనం చేసి అందరూ నిద్ర పోయారు. ఆ తర్వాత అతడు మరో గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడికి ఇంకా వివాహం కాలేదు. ఈ మేరకు తండ్రి జనార్దన్‌రెడ్డి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

» బాలల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు అపర్ణ గిరిధర్‌రావు



బాలసదనంలో రికార్డులను పరిశీలిస్తున్న అపర్ణ గిరిధర్‌రావు

వనపర్తి రాజీవ్ చౌరస్తా, జనవరి16 (ఆంధ్రజ్యోతి) : బాలల సంరక్షణ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని బాలల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు అపర్ణ గిరిధర్‌రావు విద్యార్థులకు సూచించారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని బాలసదనాన్ని గురువారం ఆమె పరిశీలించారు. కేంద్రంలో చిన్నారులకు అందుతున్న సేవలు, మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. బాలల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. సిబ్బందికి సూచనలు, సలహాలు చేశారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి సభ్యులు వనజ కుమారి, విష్ణు, విజయ్ కుమార్, అరుంధతి, డీసీపీవో రాంబాబు, యాదమ్మ పాల్గొన్నారు.

పెను విషాదానికి.. 18 ఏళ్లు

» 2007 జనవరి 18న కృష్ణానదిలో మునిగిపోయిన మర బోటు
» రాయలసీమకు చెందిన 61 మంది జలసమాధి
» సింగోటం బ్రహ్మోత్సవాలకు వస్తుండగా దుర్ఘటన
» ఈ ఏడాదీ భక్తులకు తప్పని బోటు ప్రయాణం
» ఐకానిక్ వంతెన నిర్మాణానికి రూ. 1,082 కోట్లు
» టెండర్ల ప్రక్రియ పూర్తి, త్వరలో పనులు ప్రారంభం
» వచ్చే పుష్కరాల నాటికి పూర్తయ్యే అవకాశం



కృష్ణానదిలో బోటు ఎక్కుతున్న ప్రయాణికులు

కొల్లాపూర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానదిలో మరబోటు మునిగిపోయి 61 మంది జలసమాధి అయిన సంఘటన జరిగి 18 ఏళ్లు నిండాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, సింగోటం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు రాయలసీమకు చెందిన భక్తులు కృష్ణానది మీదుగా మరబోటులో వస్తుండగా జరిగిన ఈ దుర్ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ప్రతీ సంవత్సరం జనవరి రెండవ వారంలో సింగోటం బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా రాయలసీమ, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారు. అలాగే 2007, జనవరి 18వ తేదీన బ్రహ్మోత్సవాల్లో ప్రధానఘట్టమైన రథోత్సవాన్ని తిలకించేందుకు కర్నూల్ జిల్లా, పగిడాల మండలం, నెహ్రూనగర్‌కు చెందిన భక్తులు మరబోటులో బయలు దేరారు. తెలంగాణ ప్రాంతంలోని మంచాలకట్ట గ్రామానికి చేరువలో బోటు అదుపుతప్పి కృష్ణానదిలో మునిగిపోయింది. ప్రమాదంలో 61 మంది జలసమాధి అయ్యారు. బోటులో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం వల్ల జరిగిన ఈ ప్రమాదం భక్తుల కుటుంబాల్లో విషాదం నింపింది. అప్పట్లో ఈ సంఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

అమలు కాని వైఎస్ఆర్ హామీ

ప్రమాదం జరిగిన మరుసటి రోజు 19వ తేదీన ఉదయం 11 గంటలకు హెలికాప్టర్ ద్వారా అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి మంచాలకట్ట గ్రామానికి చేరుకొని, ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు. నదిలో గాలించి మృతదేహాలను వెలికి తీసి బాధిత కుటుంబాలకు అప్పజెప్పాలని రెవెన్యూ, పోలీస్ అధికారులను ఆదేశించారు. ఇరు ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ప్రకటించారు. సోమశిల - సిద్దేశ్వరం వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అప్పటి మహబూబ్‌నగర్ కలెక్టర్ సుధారాణి ఆధ్వర్యంలో, పోలీస్, రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఇతర శాఖల సమన్వయంతో మృతదేహాల కోసం 10 రోజుల పాటు గాలించారు. సంఘటనా స్థలంలోనే క్యాంపులు వేసుకొని పర్యవేక్షించారు. చివరకు ప్రమాదం జరిగిన ప్రదేశానికి అర కిలోమీటరు దూరంలో మృతదేహాలు లభ్యం అయ్యాయి. మరో మూడు మృతదేహాలను జటప్రోల్ వైపు గుర్తించి బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆ తర్వాత 2009 అసెంబ్లీ ఎన్నికల సమయంలో, ఫిబ్రవరి 13వ తేదీన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కొల్లాపూర్ పర్యటనకు వచ్చారు. స్థానిక ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావుతో కలిసి వంతెన నిర్మాణానికి సంబంధించిన పైలాన్‌ను ఆవిష్కరించారు. కానీ ఇప్పటివరకు ఆ హామీ అమలు కాలేదు. ప్రస్తుతం సింగోటం బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. రాయలసీమ, కడప, కర్నూల్, నంద్యాల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. వారికి మర బోటులో ప్రయాణం తప్పని సరిగా మారింది.

వెంతన నిర్మాణానికి కేంద్రం కసరత్తు

అయితే తాజాగా కృష్ణానదిపై ఐకానిక్ వంతెన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే కల్వకుర్తి నుంచి కొల్లాపూర్ వరకు 167కే జాతీయ రహదారి పనులు రూ.900 కోట్ల వ్యయంతో రెండు లేన్ల రహదారి పనులు వేగంగా జరుగుతున్నాయి. రూ.1,082 కోట్ల వ్యయంతో సోమశిల - సిద్ధేశ్వరం మధ్య కృష్ణానదిపై కేబుల్, సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణానికి ఆన్‌లైన్ టెండర్ల ప్రక్రియ ఈ నెల 10న ముగిసింది.

రక్షణ చర్యలు తీసుకోవాలి

» నిబంధనలు పక్కాగా అమలు చేయాలి

రాయలసీమ ప్రాంతం నుంచి బ్రహ్మోత్సవాలకు మరబోటులో వచ్చే భక్తుల రక్షణ కోసం రెవెన్యూ, పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. కృష్ణానది తీర గ్రామాలు, ప్రాంతాల్లో మర బోటు యజమానులను అప్రమత్తం చేయాల్సి ఉంది. బోటులో ప్రయాణించే వారందరూ లైఫ్ జాకెట్లు ధరించేలా చూడాల్సి ఉంది. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం ప్రతీ సంవత్సరం జనవరి 18న జరిగేది. కానీ ఈ ఏడాది 17వ తేదీనే నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి రాయలసీమ ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో భక్తులు మరబోటులో కృష్ణానది మీదుగా సింగోటం క్షేత్రానికి తరలిరానున్నారు. ఈ సందర్భంగా భక్తుల రక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.





ఎద్దుల బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, పోటీలో తలపడుతున్న పొట్టేళ్లు

ఢీ అంటే ఢీ

» ఉత్సాహంగా బండ లాగుడు పోటీలు
» హోరాహోరీగా పొట్టేళ్ల పందేలు

ఇటిక్యాల, జనవరి (ఆంధ్రజ్యోతి) 16 : పోటాపోటీగా ఎద్దుల బండ లాగుడు పోటీలు కొనసాగాయి. పొట్టేళ్లు ఢీ అంటే ఢీ అన్నట్లుగా తలపడ్డాయి. జోగుళాంబ గద్వాల జిల్లా, ఇటిక్యాల మండలంలోని వావిలాల గ్రామంలో, శివాంజనేయ స్వామి ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన ఈ పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో కొనసాగాయి. బండలాగుడు పోటీలు, ఆరు పళ్ల విభాగంలో 14 జతల ఎద్దులు పాల్గొన్నాయి. పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, నంద్యాల జిల్లా, పాణ్యం తాలూకా, విన్నాపురం గ్రామానికి చెందిన విజయమ్మ గారి వెంకట కృష్ణయ్య ఎద్దులు ప్రథమ స్థానంలో నిలిచి రూ. 40 వేల నగదు బహుమతిని సాధించాయి. ఇటిక్యాల మండలం, సాతర్ల గ్రామానికి చెందిన హర్షద్ పాషా ఎద్దులు రెండవ స్థానంలో నిలిచి రూ. 30 వేలు, యశ్వంత్‌యాదవ్ ఎద్దులు మూడవ స్థానంలో నిలిచి రూ. 20 వేలు సొంతం చేసుకున్నాయి. ఆ తర్వాత జరిగిన పొట్టేళ్ల పెందెంలో నంద్యాల జిల్లా తిమ్మాపురం హనుమ పొట్టేలు ప్రథమ స్థానంలో నిలిచి,రూ. 20వేలు, బింగిదొడ్డి పరశురాములు పొట్టేలు ద్వితీయ స్థానంలో నిలిచి రూ. 15 వేల బహుమతి పొందాయి. కోడుమూరు ముల్లగుర్తి భైరవ పొట్టేలు మూడవ స్థానంలో నిలిచి రూ. 10 వేలు, ఆయజ నర్సింహ పొట్టేలు నాలుగవ స్థానం దక్కించుకొని ఐదువేల రూపాయల బహుమతి పొందాయి. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎద్దులు, పొట్టేళ్ల యజమానులకు నగదు, జ్ఞాపికలను అందించారు. పోటీలను తిలకించేందుకు చుట్టు గ్రామాల ప్రజలు తరలివచ్చారు.

ఎన్నికల సామగ్రికి టెండర్ల ఆహ్వానం

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 441 గ్రామ పంచాయతీ రెండవ సాధారణ ఎన్నికలకు సంబంధించిన స్టేషనరీ వస్తువులు, ఇతర పోలింగ్ సామగ్రిని సరఫరా చేసేందుకు ఆసక్తి గల సంస్థల యజమానుల నుంచి ఈ నెల 17 నుంచి 21 వరకు సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు రెవె న్యూ అదనపు కలెక్టర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీల్డ్ టెండర్లు 21 సాయంత్రం మూడు గంటల వరకు జిల్లా పంచాయతీ కార్యాలయంలో విడివిడిగా సమర్పించాలని సూచించారు. టెండర్లు 22 ఉదయం 11 గంటలకు జిల్లా అదనపు కార్యాలయంలో తెరవబడుతాయని వివరించారు. ఆసక్తి గల వారు మరింత సమాచారం కోసం జిల్లా పంచాయతీ కార్యాలయంలో పనిదినాలలో సంప్రదించాలి కోరారు.

భక్తిశ్రద్ధలతో ప్రభోత్సవం

» పురవీధుల్లో ఉత్సవమూర్తుల ఊరేగింపు » నేడు రథోత్సవం » ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి జూపల్లి





లక్ష్మీనరసింహ స్వామి నృత్యరూపకాన్ని ప్రదర్శిస్తున్న చిన్నారులు, కళాకారులతో మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్ ,జనవరి16 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ మండల పరిధిలోని సింగోటం గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి ప్రభోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆలయ వ్యవస్థాపకుడు, ట్రస్టు చైర్మన్ ఎస్‌వీకేకే ఆదిత్య లక్ష్మారావు హాజరయ్యారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఉంచి రత్నగిరి కొండ సమీపంలోని జమ్మి చెట్టు వరకు ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది.

నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను హెచ్చరించారు. గురువారం సాయంత్రం ఆయన సింగోటం క్షేత్రాన్ని సందర్శించారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించనున్న రథోత్సవానికి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు అసౌ కర్యం కలుగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బాదావత్ సంతోష్‌ను ఆదేశించారు. పక్కనే ఉన్న శ్రీవారి సముద్రం చెరువు కట్టను పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉండటంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే శుభ్రం చేయాలని ఆదేశించారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన తాగునీరు, మరుగుదొడ్లను పరిశీలించారు. ఆలయ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, లేకపోతే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో చిన్నారులు ప్రదర్శించిన లక్ష్మీ నరసింహ స్వామి నృత్య రూపకాన్ని తిలకించారు. చిన్నారి కళాకారులను అభినందించి సత్కరించారు.

జూరాల కాలువలోకి రసాయనిక వ్యర్థాలు

» నురగలు తేలిన నీరు » రైతుల ఆందోళన



కాలువలో నీటిపై తేలిన నురగ

పెబ్బేర్ రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, పెబ్బేరు మండలంలో జూరాల డీ-19 కాలువలో రసాయనిక వ్యర్థాలు కలుస్తున్నాయి. దీంతో నీటిపై నురగలు తేలడంతో అయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. కొందరు రైసుమిల్లుల యజమానులు రసాయనిక వ్యర్థాలను రాత్రి వేళ ట్యాంకర్లలో తీసుకొచ్చి కాలువలో వదులుతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఆ నీరు తాగిన పశువులు అనారోగ్యం బారిన పడుతున్నట్లు వారు వాపోతున్నారు. కొన్ని రోజుల క్రితం కూడా కాలువలో వస్తున్న నీటి రంగు మారడంతో స్థానికులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా వారు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జూరాల కాలువలో రసాయనిక వ్యర్థాలు కలువకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఈఈ జగన్‌మోహన్‌రెడ్డిని 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా తమ దృష్టికి రాలేదన్నారు. కాలువపై పరివేక్షణ చేపట్టి, రసాయనిక వ్యర్థాలు ఎక్కడ కలుస్తున్నాయో తెలుసుకుంటామని చెప్పారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

» ఒలింపిక్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఒలింపిక్ సంఘం ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్ అన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలో, టీడీ గుట్ట యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో కొత్తగంజ్ జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమన్నారు. ప్రతిభ చూపి రాణిస్తే బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకుడు యాదయ్య, తిరుపతి, శంకర్, నాయకుడు రాజు పాల్గొన్నారు.



విజేత జట్టుతో ఒలింపిక్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్



ఇంటర్వ్యూ..

పదిలో ఉత్తమ ఫలితాలకు కృషి
- ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి



తాడూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి రానున్న రోజుల్లో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ముందుకెళ్తున్నామని మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం మరికొద్ది రోజుల్లోనే అన్ని తరగతుల విద్యార్థులకు వార్షిక పరీక్షలు సమీపిస్తున్న వేళ అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులను అప్రమత్తం చేస్తూ ముందుకెళ్తున్నామన్నారు.

మండలంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఎంత మంది ఉన్నారు? వారికి వార్షిక పరీక్షలపై ఎలాంటి అవగాహన కలిగిస్తున్నారు?

మండల కేంద్రంతోపాటు మండలంలోని ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక కేజీబీవీతోపాటు మొత్తం కలుపుకుని 290 మంది పదవ తరగతి విద్యార్థులు ఉన్నారు. వీరందరికీ వచ్చే మార్చి 21వ తేదీ నుంచి వార్షిక పరీక్షలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులచే అవగాహన కల్పిస్తూ ముందుకెళ్తున్నాం.

పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేశారా?

ప్రస్తుతం మండల వ్యాప్తంగా అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు సాయంత్రం వేళ 45 నిమిషాలు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. తాడూరు, సిర్సవాడ ఈ రెండు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పది పరీక్ష కేంద్రాలు ఉంటాయి. ప్రత్యేక యూనిట్ టెస్టులు కొనసాగుతున్నప్పటికీ మరికొద్ది రోజుల్లో ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించి వారి సామర్థ్యాలను మెరుగుపర్చి జిల్లాలోనే ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా శక్తివంచన లేకుండా కృషి చేస్తాం.

న్యూస్ బాక్స్

సారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారుల దాడులు



బెల్లం పానకం పారబోస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

చారకొండ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) చారకొండ మండల కేంద్రం పరిధిలోని రాంపురంలో గురువారం ఎక్సైజ్‌శాఖ అధికారులు మహబూబ్‌నగర్ డీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఏసీ విజయభాస్కర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఈఎస్ గాయత్రి ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 500 బెల్లం పానకం ధ్వంసం చేసి 5 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు కల్వకుర్తి ఎక్సైజ్ శాఖ సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. నాటుసారా తయారు చేసిన, అమ్మిన, బెల్లం, పటిక విక్రయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాటుసారా నిర్మూళన కోసం ఫిబ్రవరి 15 వరకు విస్తృత దాడులు నిర్వహిస్తామని సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటేశ్వర్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ సీఐ కవిత, చారకొండ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మృతుని కుటుంబ సభ్యులకు పరామర్శ

పెద్దకొత్తపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మరికల్ గ్రామంలో పగడాల కృష్ణయ్య గురువారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ ప్రధాన అనుచరుడు ఇమామ్‌గౌడ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు బాధిత కుటుంబ సభ్యుల ను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. దహన సంస్కారాల కోసం మృతుని కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇమామ్‌గౌడ్, కొల్లె ఈశ్వర్, పుట్ట రాములు, హబీబ్, రమేష్, నక్క స్వామి, కాటం శ్రీరాములు, కాటం లింగస్వామి, కాటం చిన్నయ్య, పుట్ట చంద్రయ్య, ఫక్రుద్దీన్, ఎండి.ఆజమ్, బొల్లె నరసింహ, శ్రీను పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

పదర, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తిపై గురువారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు అయ్యింది. పదర ఎస్ఐ సద్దాం హుసేన్ తెలిపిన వివరాలు... మండల కేంద్రంలో ఉన్న వైన్స్ ముందు బుధవారం రాత్రి ఇరు వర్గాల మధ్య గొడవ జరిగింది. అందులో మండల కేంద్రానికి చెందిన ఎస్సీ (మాల) వ్యక్తి అయిన పోగుల బాలరాజు తన స్నేహితులతో కలిసి తన స్నేహితులతో కలిసి వైన్స్‌లో మందు తాగే సమయంలో అదే గ్రామానికి రామాంజనేయులు, తిరుపతయ్య, శివలు కులం పేరుతో దూషించి మూకుమ్మడిగా దాడికి పాల్పడడంతో వారు ఆసుపత్రి చూపించుకున్నారు. గురువారం పీఎస్‌లో ఫిర్యాదు ఇవ్వగా దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రైతు సంబురాలు నిర్వహించడం సంతోషం

- అంతర్రాష్ట్ర వృషభరాజముల బండలాగుడు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు



బహుమతులు అందజేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కోడేరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి అంటేనే రైతుల పండుగ అని, రైతు సంబురాలలో భాగంగా ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించడం ఎంతో సంతోషకరమని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మన సంస్కృతీ సంప్రదాయాల్లో ఎద్దుల బండ్ల ప్రదర్శన, బండలాగుడు పోటీలు నిర్వహించడం భాగమని ఆయన అన్నారు. మండల కేంద్రంలో అంతర్రాష్ట్ర వృషభరాజముల బండలాగుడు పోటీల్లో విజేతలకు గురువారం మంత్రి బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి షేక్ మహమ్మద్ షరీఫ్ నారాయణపురం (అనంతపురం జిల్లా) 2853.5 అడుగులు బండ లాగి రూ.80 వేల బహుమతిని గెలుచుకున్నారు. రెండవ బహుమతి నంద్యాల జిల్లా వీఆర్‌పల్లికి చెందిన ఎం.నాగయ్య ఎద్దులు రూ. 60వేలు, మూడో బహుమతిగా నాగర్‌కర్నూల్ యాదిరెడ్డిపల్లికి చెందిన డాక్టర్ అఖిలేష్‌రెడ్డి ఎద్దులకు రూ. 50 వేలు గెలుచుకున్నారు. ఇలా ఎనిమిది బహుమతులుగా వివిధ జిల్లాలకు చెందిన రైతు లకు బహుమతులు అందజేశారు. బండు లాగుడు పోటీలలో పాల్గొని విజయవంతం చేసిన మండల ప్రజలను అభినందించారు.

మంత్రికి పంచాయతీ కార్మికుల వినతి

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని పంచాయతీ కార్మికులు ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు గురువారం వినతి పత్రం అందజేశారు. గ్రామ పంచాయతీ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు సాయిబాబు మాట్లాడుతూ ఐదు నెలల నుంచి జీతాలు లేక ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. పస్తులుండి పని చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం జీతాలు వెంటనే చెల్లించాలని మంత్రిని కోరారు.

చెర్కూర్‌లో ఈదమ్మమాందాత బోనాలు



అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న జైపాల్‌యాదవ్, గోలి శ్రీనివాస్‌రెడ్డి

వెల్దండ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చెర్కూర్ గ్రామంలో ఈదమ్మ మాందాత బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వివిధగ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున హాజరై అమ్మవారికి పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డిలు ఉత్సవాలకు హాజరై అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యురాలు ద్యాప విజితారెడ్డి, నాయకులు నిరంజన్, భాస్కర్‌రావు, భీమయ్యగౌడ్, జంగిలి యాదగిరి, ప్రసాద్, అశోక్, నర్సింహ, శేఖర్ ఉన్నారు.

సాగు యోగ్యంకాని భూముల గుర్తింపునకు సర్వే



గుమ్మకొండలో రెవెన్యూ వ్యవసాయ శాఖ అధికారులు సాగు యోగ్యం కానీ భూములను గుర్తించేందుకు నిర్వహిస్తున్న సర్వే

తాడూరు/ తిమ్మాజిపేట/ కోడేరు/ పదర/, పెద్దకొత్తపల్లి/ తెలకపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా పథకానికి సంబంధించి గ్రామాల్లో సాగుయోగ్యం కాని భూములను గుర్తించేందుకు సర్వే ప్రారంభమైంది. గురువారం తాడూరు మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో ఏఈవోలు, పంచాయతీ కార్యదర్శులు ఉపాధి హామీ సిబ్బంది, కార్యాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాడూరు మండల వ్యాప్తంగా నాలుగు సర్వే కమిటీలను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో సాగుయోగ్యం కాని భూములకు సంబంధించి గ్రామ పరిసరాల్లో ఉన్న సర్వే నెంబర్లు, రహదారుల వెంట ఉన్న సర్వే నెంబర్లు కేఎల్ఐ కాల్వల సర్వే నెంబర్లు, గుట్ట, బండ ప్రాంతాలు, నది పరివాహక ప్రాంతాలు వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి సాగుకు యోగ్యంకాని భూములను మాత్రమే గుర్తిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్మయి, ఎంపీడీవో ఆంజనేయులు, ఎంపీవో బ్రహ్మచారి, అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఏఈవోలు, పలు శాఖలకు చెందిన కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మకొండలో భూముల సర్వే

తిమ్మాజిపేట మండలం గుమ్మకొండ గ్రామ శివారులో గురువారం సాగుకు యోగ్యం కానీ భూములను గుర్తించేందుకు సహాయ వ్యవసాయ సంచాలకులు వాసు, మండల వ్యవసాయ అధికారి కమల్ కుమార్, గిర్దావర్ రవి చంద్ర, ఏఈవో శివకు మార్‌లు సర్వే ప్రారంభించారు. వ్యవసాయ పొలంలో ఏర్పాటు చేసిన ప్లాట్లను అధికారులు గుర్తించారు.

రైతు భరోసా ఫీల్డ్ సర్వే

కోడేరు మండలంలో అధికారులు మూడు టీములుగా ఏర్పడి కోడేరు డీటీ జయలక్ష్మి, ఏఈవో, పసుపుల సురేందర్, ఆర్ఐ, ఏఈవో రాజాపూర్ ఆర్ఐ జములయ్య, ఏఈవోలు టీములుగాయపడి సర్వే నిర్వహించారు.

సర్వేకు రైతులు సహకరించాలి

రైతు భరోసా సర్వేకు రైతులందరు సహకరించాలని తహసీల్దార్ సురేష్ బాబు అన్నారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని ఇప్పలపల్లి గ్రామాలలో రెండు టీంలను ఏర్పాటు చేసి సర్వే నిర్వహింపజేశామని తెలిపారు. డీటీ బీక్యా, గిర్దావర్ శేఖర్, వ్యవసాయ అధికారి సూరజ్ పాల్గొన్నారు.

వెల్టూరును మండలం చేయాలి

- డీసీసీ జనరల్ సెక్రెటరీ, వెల్టూరు మండల సాధన కమిటీ అధ్యక్షుడు, జిల్లెల జగత్‌రెడ్డి



వెల్టూరును మండలం చేయాలని సమావేశానికి వచ్చిన వివిధ గ్రామల ప్రజలు

ఉప్పునుంతల జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : పార్టీల అతీతంగా వెల్టూరు గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి, వెల్టూరు మండల సాధన కమిటీ అధ్యక్షుడు జిల్లెల జగత్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని వెల్టూరు స్టేజీ వేంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో వెల్టూరు గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రతిపాదన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పెనిమిళ్ల, కృష్ణవరం, సీటీతండా, గువ్వలోనిపల్లి, వడ్డెరగుడిసెలు, లత్తీపూర్, ఈర్వటోనిపల్లి, పిర్వాటోనిపల్లితండా, రాయిచెడి, తిప్పాపూర్, సూర్యతండా, కొరటికల్, చాకలిగుడిసెలు, వెల్టూరు గ్రామ ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా, పలువురు వక్తలు మాట్లాడుతూ వెల్టూరును మండల కేంద్రంగా ఏర్పాటు చేసే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ప్రతీ ఒక్కరు సైనికుడిలా పని చేయాలని కోరారు. ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు. వెల్టూరు మండల సాధన కోసం కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగయ్యగౌడ్, నిరంజన్ ముదిరాజ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రంగారెడ్డి, నాయకులు రఘుపతిరెడ్డి, బాలకృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, లింగయ్య, జక్కా చంద్రశేఖర్‌రెడ్డి, మారం సురేష్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, బాలరాజు, విజేందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, లక్ష్మయ్య, నరేందర్‌రెడ్డి, శ్రీనివాసురెడ్డి, వేణు ఉన్నారు.

బహుజనుల కోసం మాయావతి జీవితం అంకితం

- మాయావతి జన్మదిన వేడుకల్లో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్



మాయావతి జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : దేశంలో బహుజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహానాయకురాలు మాయావతిఅని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని దేవకీ ఫంక్షన్ హాలులో బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేశారు. ప్రభాకర్ హాజరై కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. బహుజనులంతా బీఎస్పీతో కలిసి రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్, అసెంబ్లీ ఇన్‌చార్జీ కుమార్, నాయకులు కృపానందం, కళ్యాణ్, మల్లయ్య, బాలు, కురుమయ్య పాల్గొన్నారు.

ట్రాక్టర్ రివర్స్ పోటీలలో విజేతలకు బహుమతులు

కోడేరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నర్సాయిపల్లి గ్రామంలో గురువారం ట్రాక్టర్ రివర్స్ నడపడంలో గెలుపొందిన వారికి మాజీ ఎంపీపీ బుయ్య వెంకట్‌స్వామి, మాజీ సింగిల్‌విండో చైర్మన్ నాగవరం కొండల్‌రావు, శ్రీ గోపాల కృష్ణ ఫుట్ కంపెనీ మాస్టర్ సలీం కలీమ్ సహకారంతో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి కమ్మరి శ్రీధర్‌కు మూడు తులాల వెండి, రెండో బహుమతి తాళ్ల మద్దిలేటికి రెండు తులాల వెండి, మూడో బహుమతి సాయిబాబాకు ఒక తులం వెండి బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్యామలఅంజనేయులు, మాజీ సర్పంచు కుందేళ్ల అంజనేయులు, మాజీ సర్పంచు ఎండి అన్వర్‌పాషా, మాజీ వార్డు మెంబర్లు సుజాత సాయిబాబు, మాజీ ఉపసర్పంచు గోపాల్, కాంగ్రెస్ పార్టీ గ్రామ ప్రధాన కార్యదర్శి నాయకులు చీమల భాస్కర్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, రాజయోదర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

- పోస్టర్ల ఆవిష్కరణలో పార్టీ జిల్లా కార్యదర్శి పర్వతాలు



జిల్లా కేంద్రంలో సీపీఎం రాష్ట్ర మహాసభల పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 25 నుంచి 28 వర కు సంగారెడ్డి పట్టణంలో జరగనున్న సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వర్ధం పర్వతాలు మాట్లాడుతూ ఈ నెల 25న సంగారెడ్డిలో జరిగే భారీ బహిరంగ సభకు జిల్లాలోని సీపీఎం నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో హాజరై విజయవం తం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్. శ్రీనివాస్, గీత, నాయకులు రామయ్య, అశోక్, యాదయ్య, సత్యనారాయణ, వెంక టయ్య, మల్లికార్జున్ పాల్గొన్నారు.

కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి : సీఐటీయూ

కందనూలు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘుకు సీఐటీయూ కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 35 ఏళ్లుగా జనరల్ ఆసుపత్రిలో పని చేస్తున్న కార్మికులను విధుల్లో నుంచి తొలగించడం సరికాదన్నారు. సదర్ కాంట్రాక్టర్ వేతనాలు సరిగ్గా చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టి తొలగించడం పద్ధతి కాదని సూపరింటెండెంట్ రఘుకు ఫిర్యాదు చేశారు. తొలగించిన కార్మికులను తప్పకుండా పనిలోకి తీసుకుంటానని రఘు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వర్ధం పర్వతాలు, సహాయ కార్యదర్శి పొదిల రామయ్య, హాస్పిటల్ కార్మికులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల లబ్ధిదారుల గుర్తింపునకు సర్వే ప్రారంభం



చారకొండలో రేషన్ కార్డుల జాబితా వివరాల నమోదును పరిశీలిస్తున్న ఎంపీడీవో ఇసాక్ హుసేన్

కొల్లాపూర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ మునిసిపాలిటీ కార్యాలయం ఆధ్వర్యంలో 20 వార్డుల్లో లబ్ధిదారుల ఎంపిక కోసం రేషన్ కార్డు సర్వే ప్రారంభమైనట్లు మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మునిసిపాలిటీ పరిధిలో ఉన్న వార్డులకు వార్డు ఆఫీసర్లు స్వయంగా లబ్ధిదారులను ఫోన్ ద్వారా సంప్రదించి, నేరుగా ఇంటికి వచ్చి పూర్తి జాబితాతో సర్వే నిర్వహిస్తారని ఆయన తెలిపారు. వార్డు ఆఫీసర్లకు సహకరిం చాలని ఆయన కోరారు. వార్డు ఆఫీసర్ల ద్వారా ఫోన్ కాల్ వచ్చినప్పుడు లబ్ధిదారులు వివరాలు అందించాలన్నారు. సర్వే సమయంలో అవసరమైన డాక్యుమెంట్లను ఇవ్వాలని ఆయన సూ చించారు.

● చారకొండ : రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకొన్న లబ్ధిదారులను గుర్తించేందుకు ప్రభుత్వం నుంచి వచ్చిన జాబితా ప్రకారం సర్వే చేస్తున్నట్లు ఎంపీడీవో ఇసాక్‌హుసేన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో చేపట్టిన రేషన్ కార్డుల సర్వేను ఎంపీడీవో ఇసాక్ హుసేన్ పరిశీలించారు. మండలంలో 555 మంది కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారని, ఆ జాబితా ప్రకారం మండలంలోని అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికీ తిరిగి అర్హులను గుర్తిస్తున్నట్లు తెలిపారు. ఈ సర్వేను ఈనెల 19 వరకు పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సూదిని జైపాల్‌రెడ్డికి ఘన నివాళి



చిన్నారులకు పండ్లు, మిఠాయిలు పంచి పెడుతున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రంగినేని జగదీశ్వర్ రెడ్డి

కొల్లాపూర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఉత్తమ పార్లమెంటేరియన్, కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి జయంతిని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీవాణి విద్యానికేతన్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రంగినేని జగదీశ్వరుడు ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు అందరూ మాజీ కేంద్ర మంత్రి దివంగత సూదిని జైపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జగదీశ్వరుడు మాట్లాడుతూ దివంగత సూదిని జైపాల్‌రెడ్డి కేంద్ర మంత్రిగా పాలమూరు జిల్లాకు, రాష్ట్రానికి దేశానికి అనేక సేవలందించారని అన్నారు. చిన్నారులకు మిఠాయిలు, చాక్లెట్లు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకునమోని రాము యాదవ్, న్యాయ వాది మధుసూదన్, జమీల్, అహ్మద్‌ఖాన్, జుబేర్ ఖాన్, వెంకటస్వామి పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికకు ప్రత్యేక బృందాలు



పెద్దకొత్తపల్లిలో మాట్లాడుతున్న తహసీల్దార్ జేకే.మోహన్

పెద్దకొత్తపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్ర తిష్ఠాత్మకంగా చేపట్టిన రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డుల మంజూరుపై క్షేత్ర స్థాయిలో పరిశీలన కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు త హసీల్దార్ జేకే.మోహన్ తెలిపారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాల యంలో వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ బృందాలు ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు పెద్దకొత్తపల్లి మండలంలో తమకు కేటాయించిన గ్రామాలకు వెళ్లి పరిశీలిస్తారన్నారు. సాగు కోసం ఆమోద యోగ్యమైన భూములను గురించి గుట్టలు, నాలా వెంచర్లు, రైస్ మిల్లులు, గోదాములు భూసేకరణ చేసి కాల్వల భూములను తీసేసి నమోదు చేయాలని ఆయన తెలిపారు. ఈ నెల 21 నుంచి 24వరకు గ్రామసభలు నిర్వహి స్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.



తెలకపల్లిలో సర్వేపై అవగాహన కల్పిస్తున్న ఏవో నర్మద

● తెలకపల్లి : మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ విస్తరణ ధికారులు, రెవెన్యూ సిబ్బందితో ఏవో నర్మద రైతు భరోసా సర్వే కార్యక్రమంపై గురువారం సమావేశం నిర్వహించారు. తదుపరి చిన్నముద్దునూర్ గ్రామంలో వ్యవసాయ భూముల సర్వే, రేషన్ కార్డుల సర్వేను పరిశీలిం చారు. ఎంపీడీవో శ్రీనివాసులు, జాకీర్ అలీ, తహసీల్దార్ నర్మద, వ్యవసాయ అధికారి వెంకటయ్య, ఎంపీవో మల్లేష్, ఏపీవో, ఎంపీడీవో పాల్గొన్నారు.

● తిమ్మాజిపేట : మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పలు శాఖల అధికారులతో రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాల అమలుపై సమన్వయ సమావేశాన్ని ఎంపీడీవో లక్ష్మీదేవి నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలన్నారు. తహసీల్దార్ రామకృష్ణయ్య, మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్, మండల పంచాయతీ అధికారి రాములునాయక్, ఏపీఎం శ్రీహరి, ఏపీవో సత్యనారాయణ ఉన్నారు.

● లింగాల : మండల శివారులో రైతు భరోసా పథకానికి అర్హులైన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను తహసీల్దార్ పాండునాయక్ ప్రారంభించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సీతారాంనాయక్, తిరుపతమ్మ, సోయబ్, సర్వేయర్ రాంబాబు, ఏఈవోలు రవి, శివానంద్ పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



మరికల్‌లో కబడ్డీ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొల్లె ఈశ్వర్

పెద్దకొత్తపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : యువత క్రీడల్లో రాణించాలని కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కొల్లె ఈశ్వర్ అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మండల పరిధిలోని మరికల్ గ్రామంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలు శరీర దారుఢ్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బీరం రవీందర్ రెడ్డి, ఎండి. ఆజామ్, కాటం చిన్నయ్య, కాటం అశోక్, బొల్లె నరసింహ, బొల్లె రాముడు, ఎండి.ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.